క్లుప్తంగా

పట్టణ, గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు



సామర్లకోట బలుసులపేటలో కవాతు నిర్వహించిన సీఆర్‌పీఎఫ్ బలగాలతో ట్రైనీ డీఎస్పీ, ఎస్సైలు

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ట్రైనీ డీఎస్పీ ఈశ్వర్ యశ్వంత్ పిలుపునిచ్చారు. ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం పట్టణ పరిధిలోని బలుసులపేట, మండల పరిధిలోని ఉండూరు, పి.వేమవరం, చంద్రంపాలెం గ్రామాల్లో సీఆర్‌పీఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆయా ప్రదేశాల్లో ట్రైనీ డీఎస్పీ మాట్లాడుతూ స్వేచ్ఛాయుతమైన ఓటు హక్కు వినియోగించుకోవడం కోసం శాంతి భద్రతలను కాపాటానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ మేరకు ఎన్నికల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకొనే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికలలో బందోబస్తుపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పోలీసులతో ర్యాలీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మూర్తి, మౌనిక, ఎఎస్సై రత్నం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సామర్లకోట: స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతులను పురస్కరించుకొని సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు ఏపీఎస్‌డీఎస్ ప్రభాకర్ ఆదివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మరమ్మతుల కారణంగా ఇండస్ట్రియల్ ఏరియా, బ్రౌన్‌పేట, గణేష్ కాలనీ, రాజీవ్ గృహకల్ప ఏరియా, మెహర్ కాంప్లెక్స్, లారీ యూనియన్ ఆఫీసు ఏరియా, భాస్కర్‌నగర్, అమ్మాణమ్మ అపార్టుమెంట్, టిడ్కో గృహాల ఏరియా, అయోధ్యరామపురం, పెదపులి చెరువు, సత్యానారాయణపురం, ఫ్లీడర్‌గారి తోట ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.


కౌంటింగ్ కేంద్రం సందర్శన



కౌంటింగ్ కేంద్రాన్ని సందర్శించిన రిటర్నింగ్ అధికారి వెంకటరావు

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.వెంకటరావు ఆదివారం స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. జేఎన్‌టీయూకే సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. కల్పించాల్సిన సౌకర్యాలు, సమస్యలను అధికారులతో చర్చించి సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎన్నికల డీటీ సీతాపతిరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

పంచాంగం దిక్సూచి వంటిది



యాతగిరి మధ్వ పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న స్వామీజీ

బోట్‌క్లబ్: పంచాంగం దిక్సూచి వంటిదని ఉత్తరాది మఠాధిపతులు సత్యాత్మ తీర్థ స్వామీజీ అన్నారు. యాతగిరి మధ్వ పంచాంగాన్ని ఆదివారం ఆయన రామారావుపేట మధ్వసభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి దిక్సూచిలా పంచాంగం పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ పంచాంగాన్ని ఆచరణలోకి పెట్టుకొని కార్యక్రమాలను రూపొందించుకుంటే అంతా శుభమే చేకూరుతుందన్నారు. గత 53 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా యాతగిరి పంచాంగాన్ని ప్రచురిస్తూ మధ్వ మతానికి ఎంతో సేవ చేస్తున్నామన్నారు. యాతగిరి పరశురామ్ పంచాంగ ప్రచురణ బాధ్యతలు చేపట్టి 25 సంవత్సరాలు అయింది. ఈ సందర్భంగా రజతోత్సవ ప్రత్యేక సంచికను కూడా స్వామీజీ ఆవిష్కరించారు. యాతగిరి మధ్వ పంచాంగంలో పొందుపరిచిన విషయాలను స్వామీజీకి పరశురామ్ వివరించారు. ఈ కార్యక్రమంలో మధ్వసభ సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనే ఆయుధంగా..

- మున్సిపాలిటీ పన్నుల బకాయిల వసూలు
- ముగిసిన వడ్డీ రాయితీ
- సద్వినియోగం చేసుకున్న వినియోగదారులు
- ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.కోటి బకాయిలు



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం

సామర్లకోట: అవగాహనే ఆయుధంగా సామర్లకోట మున్సిపాలిటీ పన్నుల బకాయిలు వసూలు చేసింది. ప్రజలకు అవగాహన కల్పించి, వడ్డీ రాయితీలతో మొండి బకాయిలను వసూలు చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ రాయితీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. మున్సిపాలిటీకి రావాల్సిన పన్నుల బకాయి రూ.4.20 కోట్లు ఉంది. మార్చి నెలాఖరు నాటికి 100 శాతం పన్నులు వసూలు చేయాలని మున్సిపల్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మొండి బకాయిలపై అధికారులు దృష్టి కేంద్రీకరించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ జె.రామారావు ఆధ్వర్యంలో రూ.రెండు లక్షలకు మించి బకాయిలు ఉన్న పెట్రోలు బంకులు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, లాడ్జిలకు వెళ్లి యజమానులకు అవగాహన పెంచారు. దాంతో రూ.1.70 కోట్ల బకాయిలు వసూలయ్యాయి. మున్సిపాలిటీల పరిధిలో ఉన్న పన్నుల బకాయిలు 100 శాతం వసూలు చేసుకొనేలా ప్రభుత్వం వడ్డీ రాయితీని ప్రకటించింది. ఇంటి పన్నులు, ఖాళీ స్థలం పన్నుల బకాయిలపై 20 ఏళ్లగా రెండు శాతం వడ్డీ విధించడంతో మొండి బకాయిదారుల అసలు కంటే వడ్డీ మొత్తం ఎక్కువ అయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం మార్చి 31 నాటికి పన్నులు పూర్తిగా చెల్లించిన వారికి వడ్డీ రాయితీని ఇస్తున్నట్టు ప్రకటించడంతో వినియోగదారులలో స్పందన లభించింది. దాంతో వడ్డీ రాయితీ ప్రకటించిన తరువాత ఆదివారం సాయంత్రానికి రూ.1.50 కోట్ల వరకు వసూలు అయినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో 16వేల వరకూ ఉన్న వినియోగదారులలో 90 శాతం మంది వడ్డీ రాయితీని వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌ల ద్వారా రూ.20 లక్షల వరకూ బకాయిలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

రూ.1.13 కోట్ల వరకూ ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు

20 ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల బకాయిలపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించకపోవడంతో ఆ బకాయిలు ప్రస్తుతం రూ.1,13,43,000 వరకు పెరిగిపోయాయి. వీటిలో రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన పోలీసు, రెవెన్యూ, ఈటీసీ, టీడీడీసీ, ఎంపీడీఓ, వ్యవసాయశాఖ వంటి కార్యాలయాల నుంచి రూ.1,10,60,000 , కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.2.83 లక్షల బకాయి ఉన్నట్టు అధికారులు తెలిపారు. ప్రభుత్వం విధించిన వడ్డీతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.3.59 కోట్ల బకాయి ఉందని చెప్పారు. అయితే కొన్ని రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో భవనాలు శిథిలమై మూతపడినా వాటిపై పన్నులు విధిస్తూనే ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు వడ్డీతో కలిసి రూ.3.19 కోట్ల బకాయి ఉన్నట్టు తెలిపారు.

సిబ్బందిని వినియోగించుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సచివాలయ సిబ్బందిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం ద్వారా బకాయిల వసూలు శాతం పెంచే అవకాశం ఉంటుంది. గతంలో మున్సిపల్ బిల్లు కలెక్టర్లు బకాయిలపై శ్రద్ధ చూపక పోవడంతో మొండి బకాయిలు పెరిగిపోయాయి. పన్నులు ఎప్పటికప్పుడు చెల్లించడం ద్వారా భారం తగ్గింది. దీనిపై అధికారులు అవగాహన పెంచాలి.

– గొరకపూడి చిన్నయ్యదొర, భారతమాత సేవాపరిషత్ అధ్యక్షుడు, సామర్లకోట

అవగాహన పెంచాం



మున్సిపాలిటీకి రావాల్సిన బాకాయిలపై ప్రజల్లో అవగహన పెంచాం. మొండి బకాయిదారుల వద్దకు వెళ్లి హెచ్చరికలు జారీ చేశాం. బకాయి ఉన్న పన్నులు ఎప్పుడైనా చెల్లించక తప్పదు. అంతేకాక వడ్డీ భారం పెరుగుతుంది. డిమాండ్ నోటీసులు అందిన నెల రోజుల్లో చెల్లించుకోవడం ఉత్తమం. బకాయిలపై సచివాలయ సిబ్బందికి సూచనలు ఇచ్చాం.

– జె.రామారావు, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదివి.. పీహెచ్‌డీ సాధించి..



ఏయూలో పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న కోనపల్లి పాన్సీ

పిఠాపురం: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టి అమలు చేసిన ఫీజు రియంబర్స్‌మెంటుతో చదివి పీహెచ్‌డీ సాధించినట్లు కొత్తపల్లి మండలం అమరవిల్లికి చెందిన కోనపల్లి పాన్సీ తెలిపారు. విజయనగరం సిల్లాలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేసి మంచినీటిగా మార్చి ప్రజలకు ఉపయోగకరంగా మార్చే విధానంపై పరిశోధన చేసినట్లు ఆమె తెలిపారు. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రసాదరెడ్డి చేతుల మీదుగా ఆదివారం పీహెచ్‌డీ పట్టా అందుకోవడం సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన ఫీజు రియంబర్స్‌మెంటు పథకం లేకపోతే తాను పెద్ద చదువులు చదువుకుని పీహెచ్‌డీ సాధించే అవకాశం ఉండేది కాదని ఆయన చొరవ వల్లే తాను ఈ ఘనత సాధించినట్టు ఆమె తెలిపారు. ఆమెను గైడ్ చేసిన సాల్మాన్‌రాజు, ఆమె తండ్రి కోనపల్లి సత్యనారాయణరెడ్డి ఇతర బంధువులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్

- శుభాకాంక్షలు తెలిపిన దొరబాబు
- కొవ్వొత్తుల వెలుగులతో నిండిన క్రైస్తవుల సమాధుల తోట



ఈస్టర్ వేడుకల్లో శుభాకాంక్షలు తెలియజేస్తున్న దవులూరి దొరబాబు




సామర్లకోటలో సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సామర్లకోట: యేసు క్రీస్తు పునరుత్థానం క్రైస్తవ విశ్వాసానికి మూల స్థలం అని వైఎస్సార్ సీపీ పెద్దాపురం ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం తెల్లవారు జామున క్రైస్తవులు ఏర్పాటు చేసిన ఈస్టర్ పండగ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని శుభాకాంక్షలు చెప్పారు. పట్టణ క్రైస్తవుల ఉపయోగార్థం అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అత్యవసరంగా కావలసిన ఫ్రీజర్, దానికి అవసరమైన ప్రత్యేక వాహనం ఏర్పాటుకు సహకరిస్తానని చెప్పారు. ఈస్టర్ పండగను క్రైస్తవులు అతి పెద్ద పండగగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు పరమపదించిన మూడు రోజుల తరువాత ఆదివారం ప్రాణాలతో వచ్చాడని క్రైస్తవుల నమ్మకం. వసంత రుతువులో పౌర్ణమి పూర్తి అయిన తరువాత వచ్చే ఆదివారం రోజున ఈస్టర్ పండగను జరుపుకొంటారు. స్థానిక బ్రౌన్‌పేటలో ఉన్న సమాధుల కమిటీ వద్ద మున్సిపల్ క్రిస్టియన్ మైనార్టీ కోఆప్షన్ సభ్యుడు సల్లూరి కల్యాణ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ మేకు క్రైస్తవులు నూతన వస్త్రాలు ధరించి తెల్లవారు జామునే మరణించిన వారి వారి కుటుంబ సభ్యుల సమాధుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. దీనిలో భాగంగా ఆయా సమాధులను పూలతోను, విద్యుత్తు దీపాలతోను కొవ్వొత్తులతోను అలంకరించారు. దాంతో పిఠాపురం రోడ్డులోని సమాధుల తోట కొవ్వొత్తు వెలుగులతో వెలిగిపోయింది. సమాధి నుంచి ఏసుప్రభు సజీవుడిగా లేచిన సందర్భాన్ని జ్ఞాపకం చేసుకొంటూ ప్రార్థనలు చేశారు. మృతి చెందిన తమ కుటుంబ సభ్యులు సైతం క్రీస్తు మాదిరి గానే సజీవులుగా తిరిగి లేస్తారనే నమ్మకంతో తెల్లవారు జామునే క్రైస్తవులు సమాధుల వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. మండల ఫాస్టర్ల సంఘ నాయకులు సామ్యూల్ ప్రకాష్, బి.కిరణ్‌కుమార్, పాస్టర్లు పి. ఆనంద్‌బాబు, కె.కిషోర్‌బాబు, వి.శామ్యూల్, ఎండీవీ ప్రసాద్, కౌన్సిలర్లు పాలిక కుసుమ, సాగా సురేష్, పిట్టా సత్యనారాయణ, మద్రి శేషారావు తదితరులు పాల్గొన్ని శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్రైస్తవులు చర్చిలకు చేరుకొని ప్రార్థనలు చేశారు. దాంతో మండల, పట్టణ పరిధిలోని చర్చిలు క్రైస్తవులతో నిండిపోయాయి.



ఈస్టర్ ఆరాధనలో మోకాళ్లపై ప్రార్థనలు చేస్తున్న మహిళలు



ఈస్టర్ ఆరాధనలో ప్రసంగిస్తున్న సత్యానందం

ఏసు పునరుత్థానమే ఈస్టర్

పెద్దాపురం: పాపులను రక్షించేందుకు క్రీస్తు ఏసు మానవ రూపంలో జన్మించి శిలువ ధ్యానంలో మృతి చెంది ఇచ్చిన మాట మూడవ రోజున సమాధి నుంచి లేచి పునరుత్థాన దర్శనం కల్గిన రోజునే ఈస్టర్ అంటారని పలువురు దైవజనులు అన్నారు. పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఈస్టర్ ఆరాధప వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక ఆరాధనలు నిర్వహించారు.



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో...

మండలంలోని దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోట, పిఠాపురం మండలం విరవ క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరాల్లో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీనియర్ దైవజనులు నంగిన సత్యానందం, సీజీఎం వ్యవస్థాపకులు నంగిన శామ్యూల్ సుదీప్‌లు ఆయా ఆలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఏసు పునరుత్థాన అంశం, మగ్దలేని మరియా సమాధి వద్ద ఏసు కోసం వెదకడం అనే అంశాలపై ప్రసంగించారు. సుమారు 1,000 మంది విశ్వాసులు ఆయా ఆలయాల్లో ఈస్టర్ ఆరాధనల్లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో దైవజనులు అభిషేక్, దైవజనురాలు నంగిన శాంతకుమారి, నంగిన ప్రేమలత, విశాల పాల్గొనగా శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల నిర్వాహకులు రాయవరపు వీరబాబు, సత్య, విశ్వాసులు పాల్గొన్నారు.

తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ సంఘం ఆధ్వర్యంలో..

స్థానిక జగ్గంపేట రోడ్డులోని తండ్రి కుమార పరిశుద్ధాత్మ సంఘం ఆధ్వర్యంలో ఈస్టర్ ఆరాధన ఘనంగా నిర్వహించారు. వందల సంఖ్యలో విశ్వాసులు క్రీస్తు ఆరాధనలో భాగస్వాములు కాగా పరంజ్యోతిమ్మ ఏసు పునరుత్థానంపై బోధించారు. ఈ కార్యక్రమంలో దానియేలు, రౌతు సూరిబాబు, వరప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

పిఠాపురం: నియోజకవర్గంలో ఆదివారం ఈస్టర్ పండగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శ్మశాన వాటికలను శుభ్రం చేసి సందరంగా అలంకరించి ప్రార్థనలు చేశారు.

వరి కోతలు ముమ్మరం



రహదారిపై ధాన్యం రాశులు

- ఊపందుకున్న మాసూళ్లు
- ఇప్పటికే 45 శాతం పూర్తి

పిఠాపురం: వాతావరణం అనుకూలించింది. పంటలు చేతికందే పరిస్థితి కలిసొచ్చింది. రబీ కోతలు ఊపందుకున్నాయి. రైతులు రబీ పంటల ఒబ్బిడి పనుల్లో ఉన్నారు. కోత కోసిన ధాన్యం ఇంటికి చేర్చుకునే పనిలో రైతన్న బీజీగా మారాడు. పిఠాపురం నియోజకవర్గంలో 80 శాతం పంటలు కోత దశకు చేరుకోవడంతో రైతులు యంత్రాలతో కోతలు కోసి, పంటను కళ్లాల్లో కొన్ని రోజులు ఆరబెడుతున్నారు. గత వారం రోజులుగా కోతలు ప్రారంభం కాగా ఇప్పటి వరకు సుమారు 45 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. గత రెండు రోజుల నుంచి కోతలు మరింత ముమ్మరం చేశారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉండడంతో మరో రెండు మూడు రోజుల్లో కోతలు పూర్తవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పొలాల్లోకి వెళ్లి కోత పూర్తయిన పంటను విక్రయాలకు సంబంధించి రైతులకు సూచనలు ఇస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి ఆశాజనకంగానే ఉందని ఈనెలాఖరుకు వరి కోతలు వంద శాతం పూర్తవుతాయని పిఠాపురం వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి తెలిపారు.

సంక్షేమాన్ని చూసి ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత
- జోరుగా ఎన్నికల ప్రచారం



పిఠాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వంగా గీత, ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రజల ముందుకే పాలన తీసుకువచ్చి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్లకే చేర్చుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమాన్ని చూసి వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ పిఠాపురం అభ్యర్థి వంగా గీత ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆమె ఆదివారం పిఠాపురం మున్సిపాలిటీ 27, 28 వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మా ఇంటి ఆడపడుచు వచ్చిందంటూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీతకు పిఠాపురంలో ప్రజలు సాదర స్వాగతం పలికారు. ఆమె ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. అందరితో మమేకమైన ఆమె వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అందరికీ అందుబాటులో ఉండే తనకు అవకాశం కల్పించాలని మీ ఇంటి మనిషిగా పిఠాపురం ప్రజల ఆడపడుచుగా ఆదరించాలని కోరారు. మాకు ఏ సమస్య వచ్చినా నిర్భయంగా చెప్పుకునే అవకాశం మా తోటి మహిళగా మీదగ్గర మాత్రమే ఉంటుంది అందుకే మాకు మీరే కావాలి సీఎం వైఎస్ జగన్‌నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటా తిరిగి ప్రభుత్వ పథకాలు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కార్యకర్తలు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



పిఠాపురంలో వంగా గీతను ఆప్యాయంగా పలకరించి, నా ఓటు మీకే అంటున్న వృద్ధుడు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి, ద్వారంపూడి, ఎమ్మెల్యే పొన్నాడ

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

కాకినాడ: రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్, కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. జె.రామారావుపేట ఎం.ఎం.కమ్యూనిటీ హాలులో ఆదివారం రంజాన్ మాసం సందర్భంగా ఇఫ్తార్ విందు జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, పొన్నాడ సతీష్, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ముస్లిం ప్రతినిధులు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం కోసం గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, ఉర్దూఘర్ నిర్మాణం, కొత్త మసీదుల నిర్మాణం సహా జరిగిన అభివృద్ధిని అక్కడకు హాజరైన ముస్లింలు వివరించారు. మసీదు కార్యదర్శి కాజా మొయినుద్దీన్, సభ్యులు ముబారక్, రఫీ, షాకీర్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ రెహ్మాన్‌ఖాన్, ముస్లిం ప్రతినిధులు ఖాజ, వలీబాషా పాల్గొన్నారు.





నృత్యాభినయం చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న నృత్యాలు

బోట్‌క్లబ్: చిన్నారులు చేసిన నృత్యాలు ఆహుతులను కట్టిపడేశాయి. వారు చూపిన అభినయాలు ప్రేక్షకులను మైమరపించాయి. సూర్య నృత్య నికేతన్ ఏర్పాటు చేసి 15 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నృత్య కళాకారులకు ఉగాది నంది అవార్డులు ఆదివారం స్థానిక సూర్యకళామందిరంలో అందించారు. ఈ సందర్భంగా సూర్య నృత్య నికేతన్ నిర్వాహకురాలు ఎం.వి.వి.మహాలక్ష్మి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో సంప్రదాయ నృత్యాలు 15 సంవత్సరాలుగా విద్యార్థులకు నేర్పుతున్నామన్నారు. ప్రతి ఏడాదీ సంస్థ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.